నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 11 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వైద్య అధికారులు, సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేశారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో జీవన నాణ్యత తగ్గి శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని వైద్యులు సూచించారు.

లోపల పేజీలో

## నిరుపయోగంగా..

# ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం

- శిథిలావస్థకు చేరిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు
- ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు అందని శుద్ధి జలాలు

మండలంలో ఫ్లోరైడ్ సమస్య ఉన్న గ్రామాలకు నీటి శుద్ధి జలాలను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ధనాన్ని లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిరుపయోగంగా తయారై ట్రాక్టర్లు, ట్యాంకర్లు శిథిలావస్థకు చేరి దర్శనమిస్తున్నాయి. ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు మాత్రం నీటి శుద్ధి జలాలు అందని ద్రాక్షలా తయారయ్యాయి.

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట పందిపాడు గ్రామాల పోయే మధ్యలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని 2018 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో లక్షలు వెచ్చించి నిర్మించారు. అలాగే ఈ మదర్‌ప్లాంట్ నుండి నీటిశుద్ధి జలాలను ఫ్లోరైడ్ సమస్య ఉన్న 18 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో రిజర్వ్ డిజిటల్ యూనిట్ల (ఆర్‌డియు)ను ఏర్పాటు చేశారు. మండలంలోని ఏఎస్ పేట హైస్కూల్ సమీపంలో, అనుమసముద్రం, గుడిపాడు, కుప్పురుపాడు, కొండమీద కొండూరు, వేల్పులగుంట, అక్బరాబాదు, హసనాపురం, దూబగుంట, తాతిరెడ్డిపల్లి, పొనుగోడు, పెద్దబ్బీపురం, సిబివరం, పందిపాడు, కాకర్లపాడు, శ్రీ కొలను, చిరమణ, గుంపర్లపాడు, గ్రామాల్లో రిజర్వ్ డిజిటల్ యూనిట్ల (ఆర్‌డియు)ను ఏర్పాటు చేశారు. మదర్ ప్లాంట్ నుండి గ్రామాల్లోని ఆర్డీయూకు శుద్ధి జలాలను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి 20 లీటర్ల క్యాను నాలుగు రూపాయలకు ప్రజలకు నీటిని అందజేసేవారు. ఈ పథకం ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే 2019 సంవత్సరంలో అధికారం లోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఈ పథకానికి వైఎస్సార్ సుజల స్రవంతిగా పేరు మార్చి రెండు సంవత్సరాల పాటు మదర్‌ప్లాంట్ నుండి గ్రామాల్లోని ఆర్‌డీయూకు నీటి శుద్ధి జలాలు అందజేసి కొన సాగించారు. అయితే కాంట్రాక్టర్ మదర్‌ప్లాంట్‌కు విద్యుత్తు





బకాయిలు చెల్లించకపోవడంతో ఇతర సమస్యలతో సుమారు లక్షల రూపాయల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. దాంతో కాంట్రాక్టర్ విద్యుత్తు బకాయిలను కట్టలేక చేతులెత్తేసినట్లు అధికారులు తెలిపారు. తద్వారా మదర్‌ప్లాంట్ మూతపడి నిరుపయోగంగా తయారైంది. అలాగే ఆర్‌డియు యూనిట్లు గ్రామాల్లో దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయి. ఈ పథకానికి కేటాయించిన 5 ట్రాక్టర్లు, ట్యాంకర్లు శిథిలావస్థకు

-మిగతా 2లో

## పాత డంపర్ బిన్స్ స్థానంలో

# కొత్తవి ఏర్పాటు చేయండి

**కమిషనర్ సూర్యతేజ**




నెల్లూరు నగరవ్యాప్తంగా ఉన్న పాత డంపర్ బిన్స్ స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ పనులను మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

2లో

## రోడ్లపై సంచరిస్తున్న పశువులు

# పట్టించుకోని అధికారులు



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలకు అడ్డంగా పశువులు సంచరిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని వాకర్స్ రోడ్డు, ఆచారి వీధి, మినీ బైపాస్, లాంటి పలు ప్రాంతాల్లో పశువులు రోడ్లకు అడ్డంగా వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నాయి. పశువుల యజమానులు కొందరు ఇష్టానుసారంగా పశువులను రోడ్లపైకి వదిలేస్తుండడంతో నగరంలో కొన్నిచోట్ల ఈ పరిస్థితి ఏర్పడింది. పశుగ్రాసం కొరత వల్ల పశవులకు ఆహారం దొరకకపోవడంతో అవి రోడ్లపై సంచరిస్తున్నాయి. రోడ్లపై ఉన్న చెత్తతోపాటు ప్లాస్టిక్ కవర్లను కూడా తింటూ అనారోగ్యాల బారిన పడుతున్నాయి. ఇందుకు అధికారుల పర్యవేక్షణ కొరవడడం, పశవుల యజమానులు సైతం వాటిపై దృష్టి పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నగరంలోని కొన్నిచోట్ల పశువులు ఇష్టానుసారంగా రోడ్లపైనే ఉంటూ.. వాహనదారులను, రాకపోకలు సాగించే ప్రజలకు కూడా ఇబ్బంది కలిగించే విధంగా కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. అధికారులు నిత్యం పర్యవేక్షణ లేకపోవడం,

-మిగతా 2లో



## ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై

# త్వరగా నిర్ణయం తీసుకోండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసేలా త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. ఈఎస్ఐసి డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. హాస్పిటల్ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. స్థల పరిశీలనకు సంబంధించి అంశాలపై మాట్లాడారు. త్వరితగతిన నిర్ణయం తీసుకుని హాస్పిటల్ ఏర్పాటు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

## ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు - జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 3వ శనివారం అన్నిశాఖల అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామ పంచాయతీల్లో సామాజిక మరుగుదొడ్ల భవన నిర్మాణాలను పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే మున్సిపాలిటీల్లోని వార్డుల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం, తడిచెత్త, పొడిచెత్తను వేరుగా సేకరించడం, బ్లూ, రెడ్, గ్రీన్ డస్టుబిన్లను ప్రజలకు అందించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలోని చాలా మండలాలు ఉపాధి హామీ పనుల కల్పనలో బాగా వెనుకబడి ఉన్నాయని, అన్ని మండలాల్లో 70 నుంచి 80 శాతం తగ్గకుండా పనులు కల్పించేందుకు ఎంపీడీవోలు, ఏపీవోలు లక్ష్యం నిర్దేశించుకుని పని చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో ఎంఎస్ఎంఈ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వేలో వేగం పెంచాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్, వెండర్ సెలక్షన్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్, సబ్సిడీ మెదలైన దశలను పక్కాగా అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జడ్పీ సీఈవో విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డీపీవో శ్రీధర్‌రెడ్డి, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ పాల్గొన్నారు.

# పది పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మార్చి 17 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.విజయభాస్కర్ రావు సంబంధిత అధికారులకు సూచించారు. వచ్చే నెల 17 నుండి 31 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం డీఆర్వో చాంబర్‌లో నిర్వహించారు. ఉదయం 9:30 నుండి 12:45 వరకు నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి బాలాజీ రావు వివరించారు. అలాగే మొత్తం 1622 మంది ఇన్విజిలేటర్లు నునియమించామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 174 కేంద్రాలను ఏర్పాటు చేసామని, వీటిలో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు.

డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సరైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రెవెన్యూ అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అలాగే పరీక్షలు జరుగు రోజుల్లో ఆయా కేంద్రాల సమీపంలో జెరాక్స్ షాపులను మూసి వేయాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫ రాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావే శంలో జిల్లా ఒకేషనల్ విద్యా అధికారి మధు బాబుతో పాటు పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం ఎంతమేర పెరిగింది ?



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా దేశవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం పెరుగుదలపై ఎంపీ వేమిరెడ్డి లోక్‌సభలో పలు ప్రశ్నలు వేశారు. డిసెంబర్, 2024లో విడుదలైన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ - 2023 ప్రకారం, 2021 నుంచి దేశంలోని అడవులు, చెట్ల విస్తీర్ణం 1445.5 చదరపు కి.మీ మేర పెరిగిందనేది వాస్తవమేనా.. అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్లోని జిల్లాల వారీగా పెరుగుదల వివరాలు కోరారు. దేశంలోని పశ్చిమ, తూర్పు కనుమల్లో అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టిందనేది నిజమేనా.. అని ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్దన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం 2024 డిసెంబర్ 21న విడుదల చేసిన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్ఎఫ్ఆర్) 2023 ప్రకారం.. 2021 ఐఎస్ఎఫ్ఆర్ రిపోర్టుతో పోలిస్తే దేశంలో అడవులు, చెట్ల విస్తీర్ణంలో 1445.81 చదరపు కిలో మీటర్లు నికర పెరుగుదల ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో మొత్తం అటవీ, చెట్ల విస్తీర్ణం 8,27356.95 చదరపు కిలోమీటర్లు కాగా.. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17శాతంగా ఉందన్నారు. ఐఎస్ఎఫ్ఆర్ -2023 ప్రకారం, దేశంలోని అటవీ విస్తీర్ణం 7,15342.61 చదరపు కిలోమీటర్లు కాగా.. ఇందులో పశ్చిమ కనుమలలోని పర్యావరణ సున్నిత ప్రాంతాలు కూడా ఉన్నాయని వివరించారు. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ - 2013తో పోలిస్తే.. ఐఎస్ఎఫ్ఆర్ -2023 మధ్య గత పదేళ్లలో దేశంలో 16630.25 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం పెరిగిందని వివరించారు. పశ్చిమ కనుమలలోని పర్యావరణ సున్నిత ప్రాంతంలో చాలా దట్టమైన అడవుల విభాగంలో 3465.12 చదరపు కిలోమీటర్ల పెరుగుదల నమోదైనట్లు పేర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2023 రిపోర్టు ప్రకారం 2021తో పోలిస్తే విజయనగరం జిల్లాలో అత్యధికంగా 35.35 శాతం, నెల్లూరు జిల్లాలో 17.77శాతం, కోనసీమ జిల్లాలో 10.68 శాతం పెరుగుదల ఉందన్నారు.

### పాత డంపర్ బిన్స్ స్థానంలో

# కొత్తవి ఏర్పాటు చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరవ్యాప్తంగా ఉన్న పాత డంపర్ బిన్స్ స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ పనులను మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక బట్వాడిపాలెం సెంటర్, వెహికల్ షెడ్, టీబీ హాస్పిటల్ వెహికల్ షెడ్, బారా షహీద్ దర్గా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వెహికల్ షెడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. టీబీ హాస్పిటల్ వెహికల్ షెడ్‌లో చెత్త తరలింపు వాహనాలను పరిశీలించారు. వాహనాలకు అవసరమైన పెయింటింగ్ పనులు, మరమ్మతులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు అన్ని డివిజన్లలో చెత్త సేకరణ వాహనాలు తిరిగే విధంగా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఉంచిన నూతన పుష్ కార్టులు, డంపర్ బిన్స్‌లను కమిషనర్ పరిశీలించారు. అవసరమైన అన్నిచోట్ల వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీఈఈ రఘురాం, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా 'ఎన్టీఆర్' సుజల స్రవంతి






*(మొదటి పేజీ తరువాయి)*

చేరుకున్నాయి. ఇదే అదునుగా చూసుకున్న ప్రైవేటు మినరల్స్ వాటర్‌ప్లాంట్‌లకు చెందిన యజమానులు 20 లీటర్ల క్యాన్ 15 రూపాయలకు విక్రయిస్తున్నారు. మదర్‌ప్లాంట్ వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయి శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం మళ్లీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టి గ్రామాల్లో ఉన్న ఆర్ధియు యూనిట్లకు నీటి శుద్ధి జలాలను అందజేయాలని ఫ్లోరైడ్ పీడిత సమస్యను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### రోడ్లపై సంచరిస్తున్న పశువులు

# పట్టించుకోని అధికారులు



*(మొదటి పేజీ తరువాయి)*

అరకొరగా పట్టుకున్నా, వాటిని గోశాలలకు తరలించకపోవడంతో ఈ పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహించే ఈ నగరంలో పశువుల గురించి అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇకనైనా అధికారులు జన సంచారం ఉండే ప్రాంతాల్లో పశువులు రోడ్డుకు అడ్డంగా సంచరించకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మద్దతు ధర ఇచ్చే వరకు పోరాటం

## తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర 19720 రైతులకు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలు వేంటనే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులి గండ్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తహసిల్దార్‌కి, వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు క్వింటాల్ ధాన్యంకి సుమారు 3వేల రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం మాత్రం మద్దతు ధర తగ్గించడం విచారకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా కూడా మిల్లర్లు, దళారులు కుమ్మక్కై నాలుగు, ఐదు వేల రూపాయలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకే చివరి ధాన్యం గింజ వరకు రైతుల నుండి కొనుగోలు చేయాలన్నారు. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో వరి కోతలు మొదలు వారం, పది రోజులు అవుతున్న ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదని జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఈనెల 22వ తారీఖున కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈనెల 22వ తేదీన నెల్లూరులో ఏబీఎం గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీకి, జిల్లాలోని రైతు సంఘాలు, రైతు నాయకులు, రైతులందరూ వేలాదిగా తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండవరపు శ్రీనివాసులు, పుత్తైటి మల్లికార్జున, విస్సా మునిస్వామి, రేకులుగుంట అంకయ్య, తంబి రమణయ్య, మద్దిశెట్టి సురేష్, బాలు కోటయ్య, బిళ్ళా రఘురామయ్య, జానకి రామయ్య, సిఐటియు నాయకులు చల్లుకొలుసు మల్లికార్జున, దత్త శ్రీ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి మద్దతు ధర కల్పించండి




- కనీసం మద్దతు ధర ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలం
- చలో నెల్లూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** రైతు పండించే ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఇందుకూరుపేట మండల సీపీఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కార్యాలయం ఎదుట జెండాలతో నిరసన చేపట్టి అనంతరం తహశీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు సీపీఎం నేతలతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుకి మద్దతుగా ధాన్యం రేట్లు పెంచాలని కోరుతూ ఫిబ్రవరి 22వ తేదీ నెల్లూరులో జరిగే చలో నెల్లూరు కార్యక్రమంలో అందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్‌గా రాష్ట్ర ప్రభుత్వం 500రూపాయలను అదనంగా జతపరిచి రైతులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతుల వద్ద కనీస మద్దతు ధర కంటే 300రూపాయలు తగ్గించి వ్యాపారస్తులు, దళారీలు కుమ్మక్కై రైతు కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. గిట్టుబాటుధర ఇవ్వకపోగా కనీస మద్దతు ధర కూడా ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వాతావరణ పరిస్థితులు రీత్యా పంట పొలాలు దిగుబడిదాకా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా రైతుల పట్ల చిన్న చూపుతో వ్యవహరిస్తుందన్నారు. ఏది ఏమైనా రైతులపై ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘం నాయకులు తిక్కవరపు సుధాకర్ రెడ్డి, వెన్ను వేణు, చీమకుర్తి రామిరెడ్డి, మనోహర్, నాయుడు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కొలను హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం శ్రీకొలను గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు లైంగిక దాడులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును సంఘం సీఐ వేమారెడ్డి నిర్వహించారుజిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాలతో ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్ సూచనలతో సర్కిల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థినులకు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిలకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ వేమారెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన ఓఘటనతో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా అన్ని పాఠశాలలో విద్యార్థినులకు లైంగిక దాడులపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా లైంగిక సంబంధిత వేధింపులకు పాల్పడుతున్నట్టు అనుమానం కలిగిన వారి చర్యల పట్ల సందేహం కలిగిన అటువంటి వ్యక్తుల గురించి తల్లిదండ్రులకు, సన్నిహితులకు లేదా పోలీసులకు తెలియపరచాలని సిఐ వేమారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పేట ఎస్ఐ ఏ.సైదులు హై స్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 12 వరకు సబ్సిడీ ఋణాలకు దరఖాస్తులు

- ఎంపీడీవో ప్రసన్నకుమారి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఇతర కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన బ్యాంకు ఋణాలు పొందుటకు ఈనెల 12వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో పి.ప్రసన్నకుమారి కోరారు.

## బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలకు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ యల్. చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో వివిధ బ్యాంకుల ద్వారా 52 యూనిట్లు బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈనెల 12వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా 13, కెనరా బ్యాంకు ద్వారా 12, ఎన్‌డీసీసీ బ్యాంకు ద్వారా 9, ఎస్‌బీఐ ద్వారా 9, యూనియన్ బ్యాంకు ద్వారా 9 మొత్తం 52 యూనిట్లు మంజురైనట్లు తెలిపారు. బీసీలతోపాటు ఈ బీసీ, కమ్మ క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపులకు సంబందించిన అర్హులకు ఈ సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా గాని, సచివాలయాలలో వార్డ్ వెల్ఫేర్ ద్వారా గాని, నమోదు చేసుకోవాలని తెలిపారు. రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు 21 నుండి 50 సంవత్సరాల లోపు వారై ఉండాలని, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార కార్డ్, పాస్ పోర్టు సైజ్ ఫోటో, బ్యాంక్ అకౌంట్ తోనమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జిహారిక ఆధ్వర్యంలో బిట్రగుంట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగులు నివారణకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జిహారిక మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ఎల్లవేళలా చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతపై మెలకువలను వైద్యాధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.పద్మావతి వైద్య సిబ్బంది కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల యందు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలియజేశారు. జలదంకి మండల పరిధిలోని చామదల ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ శ్రీనివాసులు, జలదంకి ప్రభుత్వ పాఠశాల యందు వైద్యాధికారి డాక్టర్ ఎస్.లక్ష్మీ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం పిల్లలు 4984 మంది పిల్లలకు గాను 4877 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా 98 శాతం పంపిణీ పూర్తయినట్లు తెలియజేశారు. సోమవారం మిస్ అయిన మిగతా పిల్లలకు ఫిబ్రవరి 17వ తారీఖున జరగబోయే మా అప్ రౌండ్ నందు మింగించ నున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలియజేశారు.

# నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం

## డాక్టర్ శివకల్పన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని 59 అంగన్వాడి సెంటర్లు, 60 ప్రభుత్వ పాఠశాలలు, 9 ప్రైవేట్ పాఠశాలలు, 3 ప్రైవేటు జూనియర్ కాలేజీలు, 2గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలు, 1 గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో దాదాపు 8121 విద్యార్థులకు జాతీయ నులిపురుగుల మందులు పంపిణీ చేసి 97శాతం లక్ష్యాన్ని సాధించినట్లు గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలం మొత్తం సుడిగాలి పర్యటన చేశామన్నారు. సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా పిల్లలకు చేతుల పరిశుభ్రత గురించి ఇంట్లో తల్లి దండ్రులు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ ఆవశ్యకత గురించి విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. అన్ని పాఠశాలలో గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. సోమవారం స్కూలుకు రాని బాలబాలికలకు ఈనెల 17వ తేదీన మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎన్ వినీత, సిహెచ్ఓ శివకుమారి, హెచ్ఈఓ కలసపాటి వెంకటసుబ్బయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సహాయకులు, ఉపాధ్యాయులు, అంగనవాడి సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ప్రత్యేక విశిష్ట నమోదుకు అవకాశం



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** భూమి ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని, దాని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు సేవలందిస్తామని చేజర్ల మండలంలోని మాముడూరు గ్రామంలో ఏవో శశిధర్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ రైతులకు, రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అని తెలిపారు. భూ ఆధారిత పథకాలకైనా పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంట బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు రాయితీ, పెట్టుబడి సహాయం వంటి పథకాలు నేరుగా పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు మున్ముందు కౌలు రైతులకు, భూములేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తిలలో ఉన్నవారికి వర్తిస్తుందని వివరించారు. **నమోదు విధానం ఎలా..** ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధానిక ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరాలు, పట్టుదల పాస్ బుక్, తీసుకొని గ్రామంలో రైతు సేవా సిబ్బందికి కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

# కావలియడవల్లిలో వైద్య శిబిరం




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి ఎడవల్లి గ్రామంలో చిరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బి.జ్యోతిరాణి, కె.నాగవినూత ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని బీసీ కాలనీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరం ఉన్న వారిని పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అలాగే గ్రామంలోని ఇంటింటా తిరిగి లార్వా సర్వే నిర్వహించారు. జ్వరం ఉన్నవారిని గుర్తించి చికిత్స నిర్వహించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని తెలిపారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధనమ్మ జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు ఏలూరు మాలాద్రి నాయుడు ఎంపీహెచ్ ఈవో షేక్ షఫీ ల్యాబ్ టెక్నీషియన్ ఝాన్సీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# 12 వరకు బీసీ రుణాలకు దరఖాస్తులు

## ఎంపీడీఓ బ్రాహ్మయ్య



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారులు దరఖాస్తు ఈనెల 12వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బ్రాహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు 12 సాయంత్రం ఐదు గంటల లోపు తమ దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్నట్లు యూనిట్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు.

# దుర్గంపై గాలింపు చర్యలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దుర్గంపై గుప్త నిధుల ముఠా పాగా వేసిందని తదంతుల నేపథ్యంతో సోమవారం పోలీసు అటవీ శాఖ సిబ్బంది సంయుక్త గాలింపు చర్యలు చేపట్టారు. గత మూడురోజుల క్రితం దుర్గం పై గుప్తా నిధుల ముఠా సంచరిస్తుంది అని పేపర్‌లో వార్తలు రావడంతో నెపంతో సీఐ వెంకటరావు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి అటవీ అధికారి కుమార రాజులు తమ సిబ్బంది నితో సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు అక్కడ ఎలాంటి కొత్త తవ్వ కాలు జరగలేదని గుప్త నిధుల ముఠా సంచారించిన ఆనవాలు లేవన్నారు.

# పద్మశ్రీ రావడం సంతోషకరం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మరుపూరు గ్రామంలో మందకృష్ణ మాదిగకి భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అవార్డు అవార్డు రావడం సంతోషకరం మన్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



# గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ

## రెవెన్యూ శాఖ అధికారులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ కనబడడం లేదని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముత్తుకూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమేరకు వరి కోతలు ప్రారంభం కాగా మార్చి నెలాఖరులో పూర్తి స్థాయిలో వరి కోతలు వస్తాయని అలాంటప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందా లేదా అంటూ రైతు సంఘం ప్రశ్నించింది. పాత ధాన్యం కూడా తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారని రైతు సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. తదుపరి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోహన్ రావు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 13వ వార్షికోత్సవ కామదేను పురస్కార బహుమతి కార్యక్రమం




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం కొత్తూరు శ్రీ లలితా మహేశ్వరి ఆశ్రమం నందు అర్చక, వేద పండితుల 13వ వార్షికోత్సవ కామధేను పురస్కార బహుమతి ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత గోపూజా కార్యక్రమంలో గోమాతతోపాటు పండిత పామరులు కలిసి దేవాలయం ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రామాయణం మహేష్ స్వామి అధ్యక్షత వహించగా మైపాడు రాజా ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్చకులకు, వేద పండితులకు కిరీట ధారణ చేసి, గంధపు మాలలు అలంకరించి, శాలువా కప్పి, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ అర్చక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డా. వెంకట శేషాచార్యులు, రామాయణం జగదీష్‌శర్మ, సురేష్ స్వామి, మణిశంకర్, శ్రీ వాసవీ కన్యకాపర మేశ్వరి ఆలయం ఛైర్మన్ శిఘాకొల్లు నాగరాజు, ప్రధానకార్యదర్శి రాజా కొండయ్య, శ్రీసాయిరామ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# లేబూరులోని యూపీ స్కూల్‌ను అప్ గ్రేడ్ చేయాలి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** లేవూరు గ్రామంలో ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను అప్ గ్రేట్ చేయాలని బిజెపి మండల ప్రెసిడెంట్ కైలాసం శ్రీనివాసులు రెడ్డి కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఫిర్యాదు రూపంలో తెలియజేశారు. అలాగే ఆ ఫిర్యాదు నకలు జెరాక్స్ కాపీని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అందజేశారు. ఆ ఫిర్యాదు కాపీలో ఉన్న వివరాలు ఇలా ఉన్నాయి.. ఇందుకూరుపేట మండలం, లేబూరు గ్రామంలో వున్న అప్పర్ ప్రైమరీ స్కూల్ సందు మొత్తం 105 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అందులో 6వ తరగతి ఎస్సీ విద్యార్థులు 3, ఎస్టీ విద్యార్థులు 5, బీసీ విద్యార్థులు 10 మంది 7వ తరగతి ఎస్సీ విద్యార్థులు 2, ఎస్టీ విద్యార్థులు 5, బీసీ విద్యార్థులు 12, ఓసీ విద్యార్థులు 1 8వతరగతి ఎస్టీ విద్యార్థులు 5, బీసీ విద్యార్థులు 4, ఓసీ విద్యార్థులు 1, మొత్తం బాలబాలికలతో పాటు 48 మంది విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయడంలో భాగంగా జీఓ నెం.117ను ఉపసంహరణ చేసి ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు జిల్లా పరిషత్, మండలపరిషత్ పాఠశాలలు అనుసంధా నించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు లేబూరు గ్రామం నుండి ఆదెమ్మ సత్రంలో వున్న జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్కు వెళ్ళి చదువుకోవాలంటే సుమారు 3కిలోమీటర్లు దూరం వెళ్ళాల్సివున్నదని, దీంతో లేబూరు గ్రామం నుండి విద్యార్థినీ, విద్యార్థులు స్కూలుకు వెళ్ళలేక కొంతమంది 10వతరగతికి వచ్చేసరికి డ్రాపౌట్గా మిగిలిపోతున్నారని తెలియజేశారు. అందువలన ప్రస్తుతం లేబూరు గ్రామంలో ఉన్న యుపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసినయెడల విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా 9, 10వ తరగతులు అదే స్కూల్లోనే విద్యను అభ్యసించగలరని తమరికి విన్నవించుకొను చున్నానని, ఎమ్మెల్యే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు రెడ్డి కోరారు.

# రైతులకు కనీసం మద్దతు ధర కల్పించాలి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ధాన్యం పండించిన రైతులకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలని, నెల్లూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ రైతు సంఘం నెల్లూరు రూరల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు రైతు సంఘం నెల్లూరు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధాన్‌లు మాట్లాడుతూ.. నెల్లూరు మండలంలో మరి కొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కాబోతున్నాయని రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోనియ్య కుండా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరలకు కొనాలని అన్నారు. అనంతరం తహసిల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.చెంచయ్య, జి.సుధీర్, ఎడవల్లి రమణయ్య, వెంకయ్య పర్చూరు ప్రభాకర్, శ్రీపతి దయాకరావు, అచ్చి అనంతయ్య, అట్లా అనిల్, జి.వెంకటేశ్వర్లు, పేరిసెట్ల వెంకటరత్నం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోజాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ బి.జ్యోతి రాణి డాక్టర్ కంచర్ల నాగ వినూతలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలు, ఐటిఐ కళాశాల నందు కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు ఈ కార్యక్రమం యొక్క ప్రాధాన్యత గురించి తెలియజేశారు. 1-5 సంవత్సరం లోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో నందు 6-19 పాఠశాలలు, హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ 400ఎంజీ మాత్రలను అందజేసి మధ్యాహ్నం భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రను మింగించారు. అలాగే పాఠశాలలకు రానటువంటి విద్యార్థులకు (ఆబ్సెంట్) పిల్లలకు ఈనెల 17వ తేదీన మాత్రలను అందజేస్తామని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. చిరమణ పీహెచ్సీ పరిధిలో 1774 మంది గాను 1682 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగిందని 96శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో జీవన నాణ్యత తగ్గి శారీరక ఎదుగుదల మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని తెలిపారు. ఇది పాఠశాలల్లో వారి హాజరును ప్రభావితం చేస్తుందని విద్యా భవిష్యత్తును దెబ్బతీస్తుందని అందువల్ల పిల్లలకు సకాలంలో సరైన నివారణ చర్యలు అవసరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతిరాణి డాక్టర్ కె.నాగ వినూత, ఎంపీహెచ్ఈఓ షేక్ షఫీ, సూపర్వైజర్ వి.సలోమి, ఉపాధ్యాయులు ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు, అంగన్ వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వరదాపురం గ్రామం నందు శ్రీ సాయినాథ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ను సందర్శించి స్కూలు యాజమాన్యంతో మాట్లాడి పిల్లలందరికీ జాతీయ నుల్లి పురుగుల దినోత్సవం ప్రాధాన్యత గురించి చెప్పడం జరిగింది. ఈ ప్రోగ్రాంలో ప్రతి బిడ్డ ఆల్బెండజోల్ టాబ్లెట్ మధ్యాహ్నం భోజనం తరువాత మింగాల్సింది. ఈ నుల్లిపురుగులు సోకిన పిల్లలకు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గటం చురుకుగా లేకపోవడం అలాంటి లక్షణాలతో ఉంటారని పిల్లలకు అవగాహన కల్పించారు. తదుపరి స్కూల్లోని పిల్లలకు ఆయన చేతుల మీదుగా ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.నరసింహారావు, ఆరోగ్య పర్యవేక్షకులు కె. శ్రీనివాసులు, ఆరోగ్య సహాయకులు ఎం.మహేంద్ర కుమార్, ఎస్.కె.రేష్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ చందన ప్రియ, ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పరీక్ష పే కార్యక్రమం విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రేరణ ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఎంఈఓ -2 శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన ఈ పరీక్షాపే కార్యక్రమం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో మానసిక ఒత్తిడిని కాక వారు పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థుల్లో ప్రేరణ ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బాలకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హుల గుర్తింపు శిబిరం




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం వారి ఆధ్వర్యంలో దివ్యాంగులు వయోవృద్ధుల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ మొహమ్మద్ ఆయుబ్ దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపకరణాలకు అర్హులైన దివ్యాంగులు వృద్ధులను గుర్తించామన్నారు. త్వరలో వారికి మూడు చక్రాల వాహనాలు వినికిడి యంత్రాలు వీల్ చైర్ తదితర ఉపకరణాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు దేవి సంధ్యారాణి ఏవో పద్మజ జూనియర్ అసిస్టెంట్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సైదాపురం జడ్పీ హైస్కూల్‌లో డా. నిత్య ప్రశాంతి సందర్శించి పిల్లల ఆరోగ్యం పట్ల పలు సూచనలు సలహాలు ఇస్తూ నులిపురుగులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. నులిపురుగులు వల్ల రక్త హీనత వస్తుందని, దాని వల్ల పిల్లలో చురుకుదనం, సరిగ్గా చదువుకోలేక పోవడం ఉంటుంది అని తెలియజేశారు. గోళ్ళు శుభ్రంగా ఉంచుకోవాలి, ఆడుకున్న తర్వాత, తినే ముందు, మరుగు దొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడ్డుకోవాలని తెలిపారు. హ్యాండ్ వాషింగ్ టెక్నిక్ గురించి వివరించారు. అలా చేయకపోయినట్లయితే కడుపులో నొప్పిగా ఉండడం వస్తుందని వివరించి ఆల్బెండజోల్ టాబ్లెట్ పిల్లలకి వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, డా నిత్య ప్రశాంతి, సీహెచ్ఓ సీ.సొరకాయల శెట్టి, పీహెచ్ఎన్ ఎస్.పుష్పమ్మ ఏఎన్ఎం శ్రీలత పాల్గొనారు.

# విద్యార్థినులు అవగాహనతో జాగ్రత్తగా ఉండాలి : సీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రెండు రోజుల క్రితం జిల్లాలో ఓ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడితో ఆత్మకూరులోని బాలికొన్నత పాఠశాలలో విద్యార్థినిలకు లైంగిక దాడులపై సోమవారం ఆత్మకూరు సీఐ గంగాధర్ అవగాహన కల్పించారు. ఆత్మకూరులోని బాలికోన్నత పాఠశాలలో ఉన్న అన్ని తరగతుల విద్యార్థినులకు పాఠశాల ఆవరణంలో ఒక కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాలతో ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్ సూచనలతో వారం రోజులపాటు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థినులకు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ గంగాధర్ తెలిపారు. రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో ఓ విద్యార్థినిని స్కూల్ వ్యాన్ డ్రైవర్, మరో యువకుడు పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డారని ఈ విషయంలో విద్యార్థి ప్రవర్తనలో వస్తున్న తేడాను గమనించి తల్లిదండ్రులు విద్యార్థినిని ప్రశ్నించగా జరిగిన ఘటనను వివరించడంతో విషయం వెలుగులోకి వచ్చిందని దీంతో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని పాఠశాలలో విద్యార్థినులకు లైంగిక దాడులపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా లైంగిక సంబంధిత వేధింపులకు పాల్పడుతున్నట్టు అనుమానం కలిగిన వారి చర్యల పట్ల సందేహం కలిగిన అటువంటి వ్యక్తుల గురించి తల్లిదండ్రులకు, సన్నిహితులకు లేదా పోలీసులకు తెలియపరచాలని సీఐ గంగాధర్ సూచించారు. త్వరలో ఈ పాఠశాల సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీఐ సూచనలు పాటిస్తూ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని పాఠశాల హెడ్మాస్టర్ కోటేశ్వరమ్మ విద్యార్థులకు తెలిపారు. శ్రెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వాగాల. శ్రీహరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కే.కోటేశ్వరమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వసుంధర పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పెషల్ ఆఫీసర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా కందుకూరు నియోజకవర్గం పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ఏర్పాట్లను కందుకూరు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అయిన యం.సూర్యతేజ, సోమవారం స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరాం, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్ కలెక్టర్, కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా శానిటేషన్ పనులు, సివిల్ వర్క్స్, జంగల్ క్లియరెన్స్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా స్థానిక టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణాలలో మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు గృహాలను అందజేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ పూజిత, కమిషనర్ అనూషలు పాల్గొన్నారు.

# హై రిస్క్‌తో కూడుకున్న గోదావరి బనకచర్ల ప్రాజెక్టు : మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కృష్ణా జలాలలో గోదావరి జలాలు కలిపితే ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 80 టీఎంసీల కృష్ణా జలాలను నాలుగు రాష్ట్రాలు పంచుకోవలసి వస్తుంది. అంతర్ రాష్ట్ర వివాదాలు తలె త్తకుండా అప్రూవల్ పొందిన నాగార్జునసాగర్ కుడి కాలవ నుండి నీటిని తరలించుకోవాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తెలుగు గంగ పర్యవేక్షణ అధికారి రాధాకృష్ణారెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి జలాలను కృష్ణా జలాలకు మళ్లించి వాటిని బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుండి నీటి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోనికి తీసుకుంటే ఈ ప్రాజెక్టుకు 80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంచినా.. గోదావరి నది జలాలు 150 అడుగులలో ఉంటే బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ 800 అడుగుల కంటే ఎత్తులో ఉంది లిఫ్ట్ ఇరిగేషన్ భారీ వేలుతో కూడుకున్నదన్నారు. గోదావరి జలాలు కృష్ణా జలాలను తాకకుండా తాడిపూడి ఎత్తిపోతల నుండి వరద కాలువల సామర్థ్యం పెంచి బొల్లాపల్లి రిజర్వాయర్ నుండి నల్లమల సాగర్‌కు నల్లమల సాగర్ నుండి బనకచర్లకు నీటిని తరలించడం మంచిదని అంతర్రాష్ట్ర వివాదాలు ఏర్పడవని రాష్ట్రంలోని ఇరిగేషన్ నిపుణులు. విశ్రాంత ఇంజనీర్లు సూచిస్తున్నారు.

### అప్రూవల్ పొందిన ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలి

నాగార్జునసాగర్ కుడి కాలవ నుండి సోమశిలకు నీటిని తరలించేందుకు అన్ని అనుమతులు ఉన్నాయి. కేంద్ర జల సంఘం ఆమోదం కూడా ఉంది. సర్వే జరిపి అలైన్మెంట్ రాళ్లను నెల్లూరు జిల్లా బీరా పేరు వరకు వేసి ఉన్నారు. అక్కడనుండి సోమశిల జలాలతో కలిపి వినియోగించుకునేటట్లు ప్రతిపాదనలు ఉన్నాయి. సాగర్ కుడి కాలువ 80 కిలోమీటర్ల వద్ద నుండి బొల్లాపల్లి రిజర్వాయర్ కు నీటిని మళ్లించి ఆ నీటిని నల్లమల సాగర్ నల్లమల సాగర్ నుండి క్రాస్ ఫీడర్ ద్వారా బనకచర్లకు నీటిని మళ్లించవచ్చు. పర్యావరణ అనుమతులు- రాష్ట్ర బడ్జెట్ బిగ్రావిటీ ద్వారా నీరు బిఅంతర్రాష్ట్ర వివాదాలు వీటిని దృష్టిలో ఉంచుకొని నీటిని తరలించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని మిడతల రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, పైడిమాని ఆదినారాయణ, నారాయణ, సుబ్బయ్యా తదితరులు పాల్గొన్నారు.



# బురాన్ పూర్‌లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బురాన్‌పూర్ గ్రామంలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. 48 ఏళ్ల అంజ రాని ఇంద్ర తన నివాసంలో మృతి చెందగా, సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, మద్యం అధికంగా సేవించడం వల్ల ఆరోగ్య సమ స్యలు వచ్చి మరణిం చాడని భావి స్తున్నారు. ఈ ఘట నపై మృతుడి కుమారుడు అంజరాని అనిల్ (18) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బీఎన్ఎస్ఎస్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరణా నికి నిజమైన కారణం పోస్టు మార్టం రిపోర్టు వచ్చిన తర్వాత తెలియనుంది.

## నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ గురుకుల కళాశాల నందు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య నిపుణులు డాక్టర్ దేవి కృప కళాశాల విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశారు. కృష్ణపట్నం సర్కిల్ సీఐ రవి నాయక్, ప్రిన్సిపల్ సుజాత, సిహెచ్ఓ షుక్కూరు, పీహెచ్ఎన్ ఉష, హెచ్‌వి నిర్మల, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం గురించి వైద్యులు మాట్లాడారు. నులి పురుగులు కడుపులో ఉండడం వల్ల అనారోగ్యపరమైన సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల మంచి జరుగుతుందన్నారు.

## సాయిబాబా మందిరంలో వార్షికోత్సవ వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బ్రహ్మదేవి గ్రామపంచాయతీ ఈదులవారిపాలెం గ్రామ ఆరాధ్య దైవం షిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 13వ తేదీన 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. దామవరపు శ్రీధర్ రెడ్డి, కలిచేటి హేమంత్‌రెడ్డి సంయుక్తంగా భక్తులను ఆహ్వానిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ వేడుకలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పూజ కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. గ్రామస్తులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు అన్నారు.

## రైతులకు నోటీసులు ఇచ్చి సమగ్రంగా సర్వే



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పైనంపురం రెవెన్యూ పరిధిలో రైతులకు సంబంధించిన భూములను రీ సర్వే చేసే ప్రక్రియలో ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులకు మొదట నోటీసులు ఇచ్చి వారు చూపించిన విధంగా హద్దుల ప్రకారం సర్వే చేస్తామని రెవెన్యూ శాఖ అధికారులు తెలియజేశారు. సోమవారం ముసునూరువారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రీసర్వేపై గ్రామ సభ జరిగింది. స్థానిక సర్పంచ్ జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. అదేవిధంగా మండల సర్వేయర్ అనురూప్, సర్వే డిప్యూటీ తాసిల్దారు శ్రీనివాసులు, గ్రామ రెవెన్యూ అధికారులు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సంబంధించిన కొన్ని విషయాలు పైన అధికారులు అర్జీలు తీసుకున్నారు. 12 బ్లాక్లుగా విభజించి సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధికారులకు సహకారం ఇవ్వాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి పన్ను బకాయిల

# వసూళ్లను వేగవంతం చేయండి : అదనపు కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100శాతం లక్ష్యాలను సాధించాలని అదనపు కమిషనర్ నందన్ సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టిడ్కో విభాగం, హౌసింగ్ విభాగం, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కేవలం 48 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని గుర్తు చేశారు. సచివాలయాల వారీగా సంబంధిత డీఈఈలు ఏఈలు పన్ను వసూళ్ల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొని మొండి బకాయిలు వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల వారీగా నిర్దేశించిన వారాంతపు లక్ష్యాలలో కనీసం 25శాతం తగ్గకుండా వసూలు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో భాగంగా గుర్తించిన డబల్ ఎంట్రీలు, రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించబడిన కుళాయిలు తదితర వాటి పూర్తి నివేదికను కౌన్సిల్ వారికి నివేదించిన పిదప కౌన్సిల్ వారి అనుమతితో సీడీఎంఏ వారికి నివేదికలు పంపిన పిదప తదుపరి చర్యలు చేపట్టుట కొరకు సచివాలయాల వారీగా లిస్టును అందజేయాలని అదనపు కమిషనర్ సూచించారు. తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లలో వార్డు సచివాలయ అడ్మిన్, కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ అమెనిటీస్ కార్యదర్శులు వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ సూచించారు. మొండి బకాయిదారులను గుర్తించి అమలులో వున్న మున్సిపల్ చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గృహాలలో స్టేజ్ కన్వర్షన్, ఆప్షన్ 1, 2 ప్రక్రియలు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. వారంలో కచ్చితంగా ఒక స్టేజ్ కన్వర్షన్, ఒక గృహ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టిడ్కో గృహాలలో లబ్ధిదారులను సచివాలయాల వారీగా చేర్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని, గృహ సముదాయాల ప్రాంగణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించామని లబ్ధిదారుల్లో అవగాహన పెంచాలని అదనపు కమిషనర్ అమెనిటీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ సుధేష్ణ, రఘురాం, ముజాహిద్దీన్, ప్రసాద్ ఏఈలు రమణారెడ్డి, అంజి రెడ్డి, హౌసింగ్, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు 40వేలు నగదు సాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన 4 కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 10వేలు వంతున మొత్తం 40వేలు నగదును సోమవారం దాతృత్వం చేశారు. సంవత్సరం పైగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి కర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న రూ.10వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది. సోమవారం 12వ వార్డు పరిధిలోని ఆత్మకూరు హజరతయ్యా, 13వ వార్డు పరిధిలోని కోలా అశోక్, 15వ వార్డు పరిధిలోని కల్లూరి వెంకట రమణమ్మ, 23వ వార్డు పరిధిలోని దేవరకొండ సుబ్బారావులు ఇటీవల కాలంలో మృతి చెందారు. ఈ కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించిన నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.40వేలు దాతృత్వం చేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర రెడ్డి మీ కుటుంబాలకు నేనెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఈనాడు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరోతమ లాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ అదే కాకుండా మాకు రూ.10వేలు దాతృత్వం చేసిన నిత్యన్నదాత కంచి పరమేశ్వరరెడ్డికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయి రేపు పెద్దకర్మకాండ ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితిలో మీ రాక మీ సహాయం మా చీకటి బ్రతుకుల్లో ఒక వెలుగు అని కన్నీటితో కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతూ బ్రతుకు జీవనం గడుపుతుంటే నేనున్నాను అంటూ మీరు ఈరోజు మాకు చేస్తున్న ఈ రూ.10వేలు ఆర్థిక సహాయం ఇప్పుడున్న ఈ కష్టాల్లో మాకు ఎంత పెద్ద మొత్తమో అర్థమవుతుందని, ఈ సహాయం మా జీవితకాలం గుర్తుపెట్టుకుంటామన్నారు. ఇదే కాకుండా ఈ కష్టకాలంలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో డెత్ ఫ్రీజర్, కైలాస రథము, పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన మీకు జీవితకాలం రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఆత్మకూరు పేద ప్రజల కష్టాలు తీర్చడానికి నేనున్నాను అంటూ మీరు మాకు అండగా నిలుస్తున్నారు మీలాంటి గొప్ప వ్యక్తి ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆ దేవుని ఆశీస్సులు మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆ దేవుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని కోళ్లవీధి, నాగులబావివీధి, అగ్రహారం, బ్రాహ్మణవీధి, దిలావర్భవి వీధి తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న సిమెంట్ రోడ్లను సోమవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యకుడు షేక్ రియాజ్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన ఆదేశాల మేరకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో ఆయా రోడ్లకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ టెక్నికల్ అధికారి రాజశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంకటేశ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## టెండర్లకుబహిరంగ వేలం పాటలు నిర్వహణ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** 2025-26 ఆర్థిక సంవత్సరంకు గాను వివిధ లైసెన్సులు ఇచ్చుటకు గాను సోమవారం దేవస్థానం టూరిజం అతిధి గృహం నందు టెండర్లు బహిరంగ వేలం పాటలు నిర్వహించడం జరిగింది. కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు గాను కందికట్టు శివ పెంచల ప్రసాద్ జొన్నవాడ వారు రూ. 24,00,001/- (గత సంవత్సరం 15,12,000/-)లకు, వస్త్రములు సేకరించుకొను హక్కుకు గాను కొత్తపట్నం సుబ్రహ్మణ్యం జొన్నవాడ వారు రూ.25,15,000/-లకు (గత సంవత్సరం రూ 25,09,000/-) హెచ్చు పాట లభించింది. తలనీలాలు సేకరించుకొను హక్కు, పాదరక్షలు భద్రపరుచు హక్కు, చాపలు, పీటలు, జంకాణా అద్దెకు ఇచ్చుకొనుట మొదలగు వాటికి పాటదారులు ఎవ్వరూ పాల్గొనందున సదరు పాటలు వాయిదా వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పర్యవేక్షణ అధికారిగావేమూరి గోపి కార్యనిర్వహణ అధికారివేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నరసింహకొండ వారు, టెండరుదారులు, పాటదారులు, గ్రామస్తులు, దేవస్థాన సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యంకు మద్దతు ధర కల్పించాలని ఆర్డీఓకు వినతి



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు మండల కమిటీల ఆధ్వర్యంలో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వము ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే 500 రూపాయలు అదనంగా ఇవ్వాలని సోమవారం స్థానిక ఆర్డీవో పావనికి వినతిపత్రం సమర్పించారు. ఈ క్రాప్ నమోదు కానీ రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు మిల్లులకు ధాన్యాన్ని తీసుకుపోయే పద్ధతికి స్వస్తి చెప్పాలని రైతులకు చాలినన్ని గోతాలు అందుబాటులో ఉంచాలని రైతులకు గతంలో బకాయిలు ఉన్న రవాణా ఖర్చులు, గోతాల బిల్లులు వెంటనే చెల్లించాలని మండల హెడ్ క్వార్టర్స్‌కు ఒక్కొక్క కొనుగోలు కేంద్రం కచ్చితంగా ఉండేటట్లు చూడాలని ఆత్మకూరు ఆర్డిఓ బి పావనికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరైన మద్దతు ధర కాదని స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు లెక్క గట్టి కుటుంబ కూలీలతో పాటుగా అయిన ఖర్చుకు 50శాతం అదనంగా చేర్చి పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. 22వ తేదీ నెల్లూరులో భారీ రైతు సమీకరణ జరిపి కలెక్టర్‌కి ఈ డిమాండ్లతోటి వినతిపత్రం సమర్పించేందుకు రైతులు రావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు లక్ష్మీపతి, లక్కు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# నందీశ్వరునికి అభిషేకం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మాఘ శుక్లపక్షం త్రయోదశి సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలాస్థానేశ్వర స్వామి దేవస్థానం నందు గల నందీశ్వరునికి సాయంత్రం విశేషాభిషేకం జరుపినారు. ఈ వేడుకకు భక్తులు భారీగా ఆలయమునకు వచ్చినారు. అనంతరం నంది వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగించినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదములు అందించారు. ఈ కార్యక్రమాన్ని భక్తులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు అని ఆలయ అధికారులు తెలియజేశారు.

స్థానిక సమస్యలు మా దృష్టికి తీసుకు వచ్చి..

# పరిష్కారాలు పొందండి : అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో స్థానిక సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాలు పొందాలని అదనపు కమిషనర్ వై.ఓ నందన్ ప్రజలకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాలను పొందేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారని, అయితే బ్యాంకు రుణాలు పొందేందుకు తప్పనిసరిగా మంచి సిబిల్ స్కోర్ వారికి ఉండాలని సూచించారు. టిడ్కో గృహాలు క్యాన్సిల్ అయిన వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించడంతోపాటు, ఆయా గృహాలను నూతన లబ్ధిదారులకు కేటాయించనున్నామని అదనపు కమిషనర్ తెలిపారు. ప్రజలనుంచి ఎక్కువగా రోడ్ల మరమ్మతు పనులు, నూతన రోడ్ల మంజూరుకు, నూతనంగా డ్రైను కాలువల నిర్మాణం కోసం విజ్ఞాపనలు అందుకుంటున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో స్థానికులు కూడా భాగస్వాములు అయితే పనులు మరింత పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయగలమని తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-25, హౌసింగ్-40, టౌన్ ప్లానింగ్-9, రెవెన్యూ-1, అకౌంట్స్-2, మొత్తం-77 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సీపీ హిమబిందు, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం షాపులకు లక్కీ డిప్ తీసిన జేసీ




**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం గీత ఉప కులాలకు కేటాయించబడిన 18మద్యం షాపులకు జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్ లక్కీ డిప్ తీశారు. సోమవారం దర్గామిట్టలోని జెడ్పీ హాల్లోని సమావేశ మందిరంలో కల్లు గీత కార్మికుల మద్యం దుకాణాల కోసం లాటరీ ప్రక్రియ కార్యక్రమం చేపట్టారు. గట్టి బందోబస్తు నడుమ జాయింట్ కలెక్టర్ కార్తీక్ సమక్షంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు గీత ఉప కులాల కేటాయించబడిన 18 మద్యం షాపులకు లక్కీ డ్రిప్ ద్వారా ఎంపిక చేయడం జరిగింది. 18 మద్యం షాపులకు 215 దరఖాస్తులను 115 మంది వేయడం జరిగిందని అధికారులు తెలిపారు. గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియకు దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలోని 18 మద్యం షాపులకు సంబంధించి నెల్లూరు నగరానికి సంబంధించి 30 దరఖాస్తులు వరకు వచ్చాయి. ఆత్మకూరు, కందుకూరు రూరల్ లకు సంబంధించి మూడు చొప్పున దరఖాస్తులొచ్చినట్లు అధికారులు తెలిపారు. గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు జరిగిన లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.శ్రీనివాసులు నాయుడు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

పోర్టు ప్రభావిత రైతులకు..

# వ్యవసాయ పనిముట్లు పంపిణీ

## అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సీఈఓ జగదీష్ పటేల్

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాల రైతాంగానికిరైతు స్నేహబంధం ద్వారా అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేసింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఈఓ జగదీష్ పటేల్ రైతులకు తన సూచనలు సలహాలు ఇచ్చారు. కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌తో అనుసంధానం చేయబడిన రైతులకు ట్రాక్టర్, ఈ-రిక్షా, మోటారు అనుసంధాన పురుగుమందుల స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పరికరాలను అందజేశారు. సుమారు 250 మంది రైతులు హాజరు కావడం. అదాని ఫౌండేషన్ ద్వారా వేరుశనగ విత్తనాలు, జిప్సం, మోటరైజ్డ్ స్ప్రేయర్లు ఇచ్చినారు.నారికేళపల్లి, రామ్ నగర్, ఆర్కాట్ పాలెం, కృష్ణపట్నం పరిసర గ్రామాల రైతులకు సాయం చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోకార్పొరేట్ వ్యవహారాలు అధికారి మృత్యుంజయ రామ్, హెచ్ ఆర్ అండ్ హెడ్ అడ్మిన్ అనురాగ్ ద్వివేది, సెక్యూరిటీ మేనేజర్ వెంకటేష్ భాస్కర్, కృష్ణపట్నం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ పి.సరళ, ఎడ్యుకేటర్ డి.రాధిక, తదితరులు పాల్గొన్నారు.



సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

అన్ని శాఖల సమన్వయంతో..

# మంత్రుల పర్యటన విజయవంతం

● ఆత్మకూరు ఆర్డీవో బి.పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఆదివారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలను ఐదుగురు మంత్రులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు పాల్గొని నిర్వహించిన కార్యక్రమలు సజావుగా విజయవంతంగా నిర్వహించడంపై అన్ని శాఖల అధికారులకు ఆత్మకూరు ఆర్డీవో బి.పావని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు రెండు రోజులపాటు రాత్రి పగలు పూర్తిగా పర్యవేక్షణ చేస్తూ వారి వారి పరిధిలో నిబద్ధతగా శ్రమించి విధులు నిర్వహించి కార్యక్రమాలన్ని విజయవంతం చేయడంపై ఆయా శాఖల అధికారులకు సిబ్బందికి సహకరించిన స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆర్డిఓ బి.పావని ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నట్లు స్థానిక తాసిల్దార్ ప్రమీల పేర్కొన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేస్తున్నామని అన్నారు. మండలంలో భూ సమస్యల పరిష్కరించేందుకు పై అధికారుల ఆదేశాలతో ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశంలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.